మత్తు వదలరా..



సాక్షి ఫోకస్

సైదాపూర్: మండలంలో ఏడాదిగా గంజాయి వినియోగం విస్తరిస్తోంది. ఒకరిని చూసి ఒకరు మత్తుకు బానిసలవుతున్నారు. మత్తులో యువకులు దాడులు, అల్లర్లు, నేరాలకు పాల్పడుతూ ప్రాణాలు సైతం కోల్పోతున్నారు. మండలంలోని సోమారం చౌరస్తా, గర్రెపల్లి రోడ్డు, దుద్దెనపల్లి గోదాం, కెనాల్ ప్రాంతాలను గంజాయి స్థావరాలుగా ఏర్పాటు చేసుకున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. హైస్కూల్ విద్యార్థులు సైతం మత్తుకు అలవాటు పడుతున్నట్లు తెలుస్తోంది. శంకరపట్నం మండలం నుంచి సైదాపూర్ మండలానికి గంజాయి సరఫరా అవుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. మండలానికి చెందిన కొందరు వివిధ రాజకీయ పార్టీల్లో యువ నాయకులుగా చలామణి అవుతూ యువతను తమవైపు తిప్పుకోవడానికి మత్తుకు అలవాటు చేస్తున్నట్లు గ్రామాల్లో ప్రచారం జరుగుతోంది. మండలానికి చెందిన కొందరు యువకులు పక్క మండలం నుంచి గంజాయి తెప్పించి యువతకు ఇస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. విచ్చలవిడిగా గంజాయి వాడకం జరుగుతుంటే అధికారలు పట్టించుకోవడం లేదని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదేపదే హెచ్చరిస్తున్నా, ముఖ్యమైన నాయకుల ఇలాకాలో గంజాయి వినియోగం పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి యువత పెడదారి పట్టకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మత్తుపదార్థాలకు బానిసకావద్దు

కరీంనగర్ రూరల్ ఏసీపీ మాధవి


రామడుగు: మాట్లాడుతున్న ఏసీపీ మాధవి

రామడుగు: విద్యార్థులు మత్తుపదార్థాలకు బానిసై జీవితం నాశనం చేసుకోవద్దని కరీంనగర్ రూరల్ ఏసీపీ మాధవి తెలిపారు. గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో బుధవారం మత్తుపదార్థాల నియంత్రణపై కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. సీఐ సరిలాల్, రామడుగు ఎస్సై వి.శేఖర్, ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

చొప్పదండి: మత్తుపదార్థాలు- అనర్థాలు, పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన ఉండాలని ఎస్ఐ గొల్లపల్లి అనూష అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ రూల్స్ పాటించి ప్రమాదాల నివారణకు పాటుపడాలన్నారు. హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని మెట్‌పల్లి జెడ్పీహెచ్ఎస్‌లో మాదకద్రవ్యాల నియంత్రణ, సైబర్ నేరాలపై ఎస్సై రవి విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్ఎం విష్ణుకుమార్, టీచర్లు సుశీల,ప్రణీత, సునిత, మీనాక్షి,సమ్మిరెడ్డి,రవికుమార్,రామకృష్ణ,తిరుపతి పాల్గొన్నారు.

గన్నేరువరం: మత్తు పదార్థాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని తిమ్మాపూర్ సీఐ కె. స్వామి అన్నారు. జంగపల్లి ప్రభుత్వ పాఠశాలలో మాదకద్రవ్యాల నివారణ చర్యలపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. గంజాయి రహిత సమాజానికి సహకరించాలని కోరారు. ఎస్సై నరేష్, ఎక్సైజ్ ఎస్సై భారతి, హెచ్ఎం శారధ, టీచర్లు పాల్గొన్నారు.

గంగాధర: గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగంతో పాటు మద్యం, ధూమపానం వంటి దురలవాట్లకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఎస్సై నరేందర్‌రెడ్డి సూచించారు. మధురానగర్ చౌరస్తాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వినియోగం-నష్టాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ పీవో సురేశ్, అధ్యాపక బృందం గోపాల్, ఇందిరా, రాజమహేందర్, రాజు, మహేశ్వర్, రాధాకృష్ణ, దీప పాల్గొన్నారు.

సైదాపూర్: మత్తుపదార్థాలకు అలవాటైతే భవిష్యత్ నాశనం అవుతుందని సైదాపూర్ ఎస్ఐ సీహెచ్.తిరుపతి సూచించారు. వెన్కెపల్లి ఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాలు-అనర్థాలు అంశంపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. మత్తు పదార్థాలను అలవాటు చేసి సమాజాన్ని విధ్వంసం చేయాలనుకునే వాళ్లకు దూరంగా ఉండాలని, అలాంటి వారి సమాచారం పోలీసులకు అందజేయాలని కోరారు. చదువుతోనే భవిష్యత్, విద్యలో రాణిస్తే ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడతారని, బడికి వచ్చేది విద్య నేర్చుకోవడానికి మాత్రమేనని ఇతర కార్యకలాపాలకు పాల్పడేవారి జీవితం ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. ఇన్‌చార్జి హెచ్ఎం రఘురాములు, టీచర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్రమశిక్షణతో చదవాలి

హుజూరాబాద్‌రూరల్: క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు అన్నారు. బుధవారం చెల్పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. యూనిఫామ్‌తో పాఠశాలకు సమయానికి రావాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సదుపాయాలు ఉన్నాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, ఇంటి, వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. హెచ్ఎం అనురాధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జమ్మికుంట: పట్టణంలో బాలుర ప్రభుత్వ పాఠశాలను డీఈవో సందర్శించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా షూ వేసుకొని స్కూల్‌కు రావాలని సూచించారు. హెచ్ఎం ఆకుల సదానందం, ఉపాధ్యాయులు ఉన్నారు.

పశువులకు టీకాలు

మానకొండూర్: మండలంలోని ఈదులగట్టెపల్లి, పెద్దూర్‌పల్లి గ్రామాల్లో బుధవారంపశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేశామని పశువైద్యాధికారి అరవింద్ తెలిపారు.

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ పశువైద్యశాలను బుధవారం జిల్లా పశువైద్యాధికారి వేణుగోపాల్‌రావు తనిఖీ చేశారు. గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని పరిశీలించి పాడిరైతులు టీకాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 186 పశువులకు టీకాలు వేశామని పశువైద్యాధికారి మాధవరావు తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ

హుజూరాబాద్‌రూరల్: యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో 27న జంబుద్వీప మహాకవి, చక్రవర్తి ఎర్ర ఉపాలి విగ్రహ ఆవిష్కరణకు సంబంధించిన కరపత్రాన్ని బుధవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రజాస్వామ్యవాదులు, ప్రజా సంఘాల నాయకులు, కళాకారులు ఆవిష్కరించారు. విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి మేధావులు, రచయితలు, కళాకారులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. ఎర్ర ఉపాలి కుమారుడు ఎర్ర సూర్య, ప్రముఖ బహుజన వాగ్గేయకారుడు మచ్చ దేవేందర్, ద్రావిడ సాహిత్య సాంస్కృతిక కళామండలి వ్యవస్థాపక అధ్యక్షుడు రామంచ భరత్, ప్రజాసంఘాల నాయకులు రత్నం, సమ్మయ్య, ప్రభాకర్, సతీశ్, సదానందం, ప్రవీణ్, శ్రీనివాస్, అంకూస్, ప్రకాశ్, భువనచంద్ర, ఐలయ్య పాల్గొన్నారు.

నీటి సరాఫరాపై శిక్షణ

శంకరపట్నం: మండలంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం మిషన్‌భగీరథ నీటి సరాఫరాపై గ్రామ పంచాయతీ పంపు ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చారు. మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమంలో నీటి సరాఫరా, లీకేజీలు, మరమ్మతులు, క్లోరినేషన్‌పై శిక్షణ ఇవ్వనున్నామని డీఈ వషీయోద్దీన్ తెలిపారు. కార్యక్రమంలో ఏఈ మొగిళి, సూపరింటెండెంట్ సర్వోత్తమరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చొప్పదండి: మండలంలోని మంచినీటి సహాయకులకు నీటి సరఫరాపై నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఆర్‌డబ్ల్యూఎస్ శంకరయ్య, ఎంపీడీవో వేణుగోపాల్, ఏఈ వినయ్ పాల్గొన్నారు.


ధర్మపురి వ్యవసాయ అధికారిగా సింధూజ

ఇల్లందకుంట: మండలంలోని సిరిసేడు గ్రామానికి చెందిన గన్ను శ్యాంసుందర్‌అరుణ కుమార్తె గన్ను సింధూజ ఓపెన్ కేటగిరీలో 31వ ర్యాంకుతో వ్యవసాయ అధికారిగా ఎంపికైంది. ఈసందర్భంగా బుధవారం గ్రామస్తులు ఆమెను అభినందించారు. ధర్మపురి మండల వ్యవసాయ అధికారిగా నియామకం కాగా జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఆమెను అభినందించారు. తండ్రి ఆశయాన్ని నిలబెట్టినందుకు సంతోషంగా ఉందని, రైతులకు సేవలందించడానికి కృషి చేస్తానని ఆమె తెలిపారు.

లైన్ ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం

చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తిలో నాలుగేళ్లుగా లైన్‌ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించి చిగురుమామిడికి బదిలీపై వెళ్లిన రాములును గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో లక్ష్మీచారిటిబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ గాదె రఘునాథరెడ్డి, మాజీ జెడ్పీటీసీ అందె స్వామి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, పోతరవేని బాలయ్య, కారోబార్ శంకరాచారి, కిషన్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

బియ్యం అందజేత


బియ్యం అందిస్తున్న పొన్నం అనిల్ గౌడ్

తిమ్మాపూర్: మండలంలోని మన్నెంపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన బీనపెల్లి లచ్చమ్మ కుటుంబాన్ని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ఉపసర్పంచ్ పొన్నం అనిల్‌గౌడ్ బుధవారం పరామర్శించారు. అనంతరం యాభై కిలోల బియ్యం అందించారు. వెంట నాంపెల్లి శంకర్, బీనపెల్లి బాలయ్య, బీనపెల్లి శ్రీనివాస్, కొలిపాక రాజయ్య, గుంటి రామచంద్రం, బీనపెల్లి సంపత్, బూడిద కిషోర్, సానగొండ సది, గోదరి కొమురయ్య, కొలిపాక శ్రీనివాస్, మల్లయ్య, సుదగోని శ్రీనివాస్, గోకురి మల్లయ్య,అలువాల అచ్చయ్య, పార్నంది మల్లయ్య ఉన్నారు.

మద్దతు ధరకు ధాన్యం అమ్ముకోవాలి

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

చొప్పదండి/గంగాధర: గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు ధాన్యం అమ్ముకోవాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. గంగాధర మండలం గర్శకుర్తి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. కేంద్రాల వద్ద రైతులు ఇబ్బందులు పడకుండా తగిన సౌకర్యాలు కల్పించాలన్నారు. అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, డీఆర్డీవో సునీత, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జాగిరపు రజితశ్రీనివాస్‌రెడ్డి, సహకార సంఘం అధ్యక్షుడు తిరుమల్‌రావు నాయకులు, రైతులు పాల్గొన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. చొప్పదండి మండలం గుమ్లాపూర్, కాట్నపల్లి గ్రామాల్లో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌తో కలిసి ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజ, సివిల్ సప్లై డీఎం సురేశ్, సునీత, తహసీల్దార్ నవీన్‌కుమార్, ఎంపీడీవో వేణుగోపాల్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలని వినతి

గంగాధర: గంగాధర సహకార సంఘం ఆధ్వర్యంలో రైస్‌మిల్లు ఏర్పాటుకు అవసరమైన స్థలం కేటాయించాలని కోరుతూ సంఘం అధ్యక్షుడు దూలం బాలగౌడ్, వైస్ చైర్మన్ వేముల భాస్కర్, పాలకవర్గం సభ్యులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కొండాయిపల్లి గ్రామ శివారులో ఆరెకరాల స్థలం కేటాయిస్తే రైతులకు అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు. వెంట డైరెక్టర్లు బెజ్జంకి కళ్యాణ్, పెంచాల చందు, బైరిశెట్టి సంపత్ ఉన్నారు.

డీఎస్సీ ఫస్ట్ ర్యాంకర్‌కు హుజూరాబాద్‌లో పోస్టింగ్

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్ గ్రామానికి చెందిన శనిగరపు మేఘనకు డీఎస్సీ ఫలితాల్లో జిల్లాలో మొదటి ర్యాంకు వచ్చింది. కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన డీఎస్సీ కౌన్సెలింగ్‌లో ఆమెకు హుజూరాబాద్ పట్టణంలోని ప్రైమరీ స్కూల్‌ను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈమేరకు బుధవారం పోస్టింగ్ ఆర్డర్‌ను హెచ్ఎంకు అందజేశారు.

20న అలయ్ బలయ్

తిమ్మాపూర్: మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ సాంస్కృతిక సారథి మాజీ చైర్మన్ రసమయి బాలకిషన్‌నేతృత్వంలో 20న మండలంలోని కొత్తపల్లి సాయిరాం గార్డెన్‌లో అలయ్ బలయ్ నిర్వహించనున్నామని బీఆర్ఎస్ మానకొండూర్ నియోజకవర్గ నేతలు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, అభిమానులు హాజరుకావాలని కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ విడుదల చేశారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు హాజరవుతారని వెల్లడించారు. కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టడం, నేతల్లో నైరాశ్యం తొలగించడంతోపాటు ప్రజా సమస్యలపై పోరాటానికి దిశానిర్దేశనం చేస్తారని తెలిపారు.


చిగురుమామిడి: మండలంలోని కొండాపూర్-సుందరగిరి గ్రామాల మధ్య ప్రమాదకరంగా ఉన్న మూలమలుపుల వద్ద ఎలాంటి హెచ్చరిక, సూచిక బోర్డులు లేవు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు, ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు హెచ్చరిక, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రాజశేఖర్, ఆర్‌అండ్‌బీ ఏఈఈ మానకొండూర్ డివిజన్ సెల్ నంబర్: 9440818867

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9848408781, 8790144227, 9553955664

'నిరుద్యోగుల గొంతుకనై ప్రశ్నిస్తా'

హుజూరాబాద్‌రూరల్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపిస్తే నాలుగు నిరుద్యోగుల గొంతుకనై ప్రశ్నిస్తానని డాక్టర్ బీఎస్‌రావు అన్నారు. బుధవారం హుజూరాబాద్‌లోని సాయి కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు సమావేశంలో మాట్లాడారు. జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతిపై ప్రభుత్వంతో పోరాటం చేస్తానన్నారు. వైద్యులు రామలింగారెడ్డి, తొగరు విద్యాసాగర్, రిటైర్ ఉద్యోగుల సంఘం నాయకులు సందుపట్ల జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ఎనర్జీ సిస్టమ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ పోస్టర్ ఆవిష్కరణ

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో నవంబర్ 11 నుంచి 16వ తేదీ వరకు జరగనున్న రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ ఎనర్జీ సిస్టమ్స్ ఫర్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం కళాశాల సెక్రటరీ, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీష్‌బాబు ఆవిష్కరించారు. ప్రోగ్రామ్‌ను, ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ న్యూఢిల్లీ నిర్వహిస్తుందని, అటల్ బేసిక్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్, ఏఐసీటీఈ ట్రైనింగ్ అండ్ లెర్నింగ్ అటల్ అకాడమీ ప్రోగ్రాం కింద ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. పరిశ్రమ రంగాల్లోని మార్పులపై చర్చ విద్యార్థులకు ఉపయోగపడుతుందన్నారు. సమావేశంలో కళాశాల డైరెక్టర్ కందుకూరి శంకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరయ్య, వివిధ విభాధిపతులు డాక్టర్ డాక్టర్ యోగేశ్ పుండలిక్, కళాశాల రిజిస్ట్రార్ డాక్టర్ వి. రాజేశ్వరరావు, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ జి .మల్లయ్య ఉన్నారు.

చదువుతోనే గౌరవం

ఇల్లందకుంట: చదువుతోనే సమాజంలో గౌరవం ఉంటుందని విద్యార్థులు చెడువ్యసనాలకు దూరంగా ఉంటూ ఉన్నత చదువులు చదువుకోవాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం సోషల్ వర్కర్ ఎం .రమేశ్ అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం బాలల హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలు, బాల్య వివాహాలు, బాల కార్మికులు, భిక్షాటన, డ్రగ్స్‌వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఇబ్బందులు ఎదురైతే చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, హెచ్ఎం, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్ తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజ

శంకరపట్నం: కేశవపట్నం ఆరోగ్య ఉపకేంద్రానికి వైద్యాధికారి శ్రావణ్ బుధవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ గుర్రం రామస్వామి, మాజీ సర్పంచ్ బస్వయ్య, తిరుపతి, వైద్యసిబ్బంది తదితరులున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని పట్టించుకోవడం లేదు


ప్రైవేటు కాలేజీల అధ్యాపకులు, విద్యార్థుల ర్యాలీ

జమ్మికుంట: రాష్ట్ర ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్ పథకాన్ని పట్టించుకోవడం లేదని చాణక్య డిగ్రీ కళాశాల డైరెక్టర్ విజేందర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కాలేజీల బంద్ బుధవారం కొనసాగింది. పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు లెక్చరర్లకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొందని, ఫీజులు కట్టలేక విద్యార్థులు చదువు మధ్యలోనే ఆపేస్తున్నారని, ప్రభుత్వం పేద విద్యార్థుల ఉన్నత చదువుకు తోడ్పడాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం,విద్యార్థులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని మంత్రి పొన్నంకు వినతి

చిగురుమామిడి: మండలంలోని నవాబుపేట్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను బుధవారం హైదరాబాద్‌లో కలిశారు. గ్రామాభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు. గ్రామంలోని వివిధ సమస్యలను విన్నవించారు. మంత్రి సానుకూలంగా స్పందించారని, ప్రతిపాదనలు సిద్ధంచేయాలని అధికారులను ఆదేశించారని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో కాంగ్రెస్‌పార్టీ గ్రామ అధ్యక్షుడు ఇనుగాల శ్రీనివాస్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఠాకూర్ నరేందర్‌సింగ్ పలువురు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

గన్నేరువరం: కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని సీపీఐ నాయకులు కోరారు. గన్నేరువరంలోని కొనుగోలు కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ రైతులను దగా చేస్తున్నారని, వర్షాలు కురిసే అవకాశం ఉందని, కేంద్రాల్లో ధాన్యం తడిసిపోకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. మండల సహాయ కార్యదర్శి చొక్కల్ల శ్రీశైలం, కోశాధికారి గర్శకుర్తి శ్రీనివాస్, నాయకులు కూన మల్లయ్య, బోయిని మల్లయ్య, ఇప్పల్ల కనకయ్య, కూన కిష్టయ్య, ఎండీ నయామ్, రైతులు నరసింహారెడ్డి, మిద్దె నర్సవ్వ, మండల ఉమ పాల్గొన్నారు.

● **అవగాహన సదస్సు**

రామడుగు: మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం ఆయిల్‌పామ్ సాగుపై లోహియా ఎడిబుల్ ఆయిల్స్ వారి ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి కమలాకర్‌రెడ్డి మాట్లాడారు. ఆయిల్‌పామ్‌తో లాభాలు పొందవచ్చని రైతులకు సూచించారు. ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందన్నారు.

● **ప్రపంచ ఆహార దినోత్సవం**

జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా అర్థశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ రమేశ్ అధ్యక్షతన బుధవారం వర్క్‌షాపు నిర్వహించారు. పలువురు వక్తలు పేదరికం నిర్మూలించాలన్నారు. పోషక విలువలు కలిగిన ఆహారంతో ధృడత్వం కలిగిన భారతదేశాన్ని సాధించవచ్చాన్నారు. హరిత విప్లవం ద్వారా ఆహారధాన్యాల ఉత్పత్తులలో స్వయం సమృద్ధి సాధించాలన్నారు.సేంద్రియ ఆహార ధాన్యాల ప్రముఖ్యతను వివరించారు.

● **పారదర్శకంగా ఎంపిక చేయాలి**

హుజూరాబాద్‌రూరల్: ఇందిరమ్మ ఇళ్ల కమిటీలను పారదర్శకంగా ఎంపిక చేసేలా కలెక్టర్ దృష్టి సారించాలని బీజేపీ జిల్లా కార్యదర్శి బింగి కరుణాకర్ కోరారు. బుధవారం మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామంలో మాట్లాడారు.

● **రహదారి పనుల పరిశీలన**

గన్నేరువరం: మండలంలోని గుండ్లపల్లి స్టేజీ నుంచి గన్నేరువరం మీదుగా ఇల్లంతకుంట మండలం పొత్తూరు వరకు నిర్మిస్తున్న డబుల్ రహదారి పనులను బుధవారం క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజినీర్ చిన్న పుల్లాదాస్ పరిశీలించారు.

● **ఇసుక ట్రాక్టర్లు పట్టివేత**

వీణవంక: మండలంలోని చల్లూరు మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లతో పాటు ఒక ట్రక్కును పట్టుకున్నట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు. డ్రైవర్లు, ఓనర్లపై కేసు నమోదు చేశామన్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

సంక్షిప్త వార్తలు

● **చర్యలు తీసుకోవాలి**

శంకరపట్నం: మండంలోని గద్దపాక నుంచి అనుమతి లేకుండా గ్రామానికి చెందిన ఎనిమిది మంది నిత్యం సైదాపూర్ మండలానికి ఇసుక తరలిస్తున్నారు. ట్రాక్టర్ డ్రైవర్లు గ్రామాల్లో వేగంగా వెళ్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

● **ఇసుక తరలించిన 10మంది అరెస్ట్**

జమ్మికుంట: మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న తనుగుల గ్రామానికి చెందిన 10 మందిని బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు టౌన్ సీఐ వరంగంటి రవి తెలిపారు.

● **గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన**

వీణవంక: మండలంలోని ఘన్ముక్కుల మోడల్ స్కూల్‌లో ఇంటర్, టెన్త్‌క్లాస్ విద్యార్థులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్, డ్రగ్స్ అనర్థాలపై ఎస్సై తోట తిరుపతి బుధవారం అవగాహన కల్పించారు.

● **పురాతన ఆలయం పరిశీలన**

సైదాపూర్: సైదాపూర్ శివారులోని సింగరాయ గుట్టపై వెలసిన లక్ష్మీ నరసింహస్వామి దేవాలయాన్ని జిల్లా దేవాదాయశాఖ అధికారులు బుధవారం పరిశీలించారు. ఆలయం ఆదరణ కరువై, శిథిలావస్థకు చేరిందని స్థానికులు మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈమేరకు స్పందించిన మంత్రి దేవాదాయశాఖ అధికారులను గుడి నిర్మాణానికి సంబంధించి నివేదికను ప్రభుత్వానికి అందజేయాలని ఆదేశించగా అధికారులు సింగరాయ గుట్ట, గుడిని సందర్శించారు.

● **ఆర్థిక సాయం**

చొప్పదండి: మండలంలోని గుమ్లాపూర్ గ్రామానికి చెందిన శివరాత్రి తిరుపతి రోడ్డు ప్రమాదంలో గాయపడగా గ్రామస్తులు చందాల రూపంలో రూ.1.10 లక్షలు జమ చేసి బుధవారం కుటుంబ సభ్యులకు అందించారు. వారం రోజుల క్రితం తిరుపతి రోడ్డు ప్రమాదంలో గాయపడగా గ్రామస్తులు చందాల రూపంలో నగదు జమ చేశారు.

వీణవంక: మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మీస వెంకటేశ్ ఇటీవల మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 కిలోల బియ్యం అందించారు. అదేవిధంగా మాజీ సర్పంచ్ మేకల ఎల్లారెడ్డి రూ.5వేలు మృతుడి కుటుంబ సభ్యులకు అందించి మానవత్వం చాటుకున్నాడు.

● **ఎమ్మెల్యే పరామర్శ**

వీణవంక: ఎల్బాక గ్రామానికి చెందిన రవి గుండెపోటుతో మృతి చెందగా ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నివాళి అర్పించారు. పలు గ్రామాలలో మృతి చెందినవారి కుటుంబాలను పరామర్శించారు.

● **ఎమ్మెల్సీ ఎన్నికలపై సమీక్ష**

మానకొండూర్‌రూరల్: మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం పట్టభద్రులు, వివిధ పార్టీలకు చెందిన ప్రజానాయకులకు తహసీల్దార్ రాజేశ్వరి బుధవారం ఎమ్మెల్సీ ఎన్నికలపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

● **మంచి అభ్యర్థిని ఎన్నుకోవాలి**

జమ్మికుంట: పట్టభద్రులు ఓటుహక్కుతో మంచి ఎమ్మెల్సీని ఎన్నుకోవాలని సామాజిక కార్యకర్త గట్టు సాయిరాం అన్నారు. పట్టణంలో బుధవారం మాట్లాడారు. మోసపూరిత హామీలు నమ్మొద్దన్నారు.

● **నేత్రదాత సంస్మరణ సభ**

సైదాపూర్: మండలంలోని దుద్దెనపల్లిలో బుధవారం నేత్రదాత సంస్మరణ సభ తెలంగాణ నేత్ర, శరీర అవయవ దాతల అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామానికి చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ ఠాగూర్ రమేశ్ సింగ్ విధి నిర్వహణలో గుండెపోటుతో మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులు అవయవదానం చేశారు. ఈసందర్భంగా సంస్మరణ సభ నిర్వహించి, కుటుంబ సభ్యులను సన్మానించారు.

సోషల్ మీడియాలో మేనిఫెస్టో వైరల్



వీణవంక: గ్రామాల్లో అప్పుడే పంచాయతీ ఎన్నికల సందడి నెలకొంది. కొందరు ఆశావహులు ఇప్పటి నుంచే ప్రజలకు దగ్గరవుతున్నారు. సర్పంచ్‌గా గెలిపిస్తే చేసే పనులు ముందే ప్రకటిస్తూ ప్రచారం చేస్తున్నారు. ఏకంగా మేనిఫెస్టో విడుదల చేస్తూ ఓట్లు రాబట్టేందుకు యత్నిస్తున్నారు. మండలంలోని లస్మక్కపల్లి గ్రామానికి చెందిన మద్దుల ప్రశాంత్ పటేల్ విడుదల చేసిన మేనిఫెస్టో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఒక్కసారి ఆశీర్వదించండి... పదితరాలు గుర్తిండిపోయేలా అభివృద్ధి చేస్తానని 15 అంశాలతో కూడిన మేనిఫెస్టోపై నియోజకవర్గ వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. రిజర్వేషన్లు ఈసారి మారే అవకాశం ఉన్నా తమవర్గానికే రిజర్వేషన్ వర్తిస్తుందనే ధీమాతో ఇప్పటికే గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు.